క్లుప్తంగా

పశుగ్రాసం దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ అధికారులు

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సంపత్ రెడ్డి వ్యవసాయ పొలంలో ప్రమాదవశాత్తు బుధవారం పశుగ్రాసం దగ్ధమైంది. పంటపొలాలకు వెళ్తున్న హార్వెస్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో నిప్పులు చెలరేగి గడ్డివాముపై పడ్డాయి. సమాచారం అందుకున్న మానకొండూర్ ఫైర్ అధికారులు గోపాల్ రెడ్డి, వినోద్, సతీష్, నరేందర్ ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు.

కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొద్దాం

తిమ్మాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త అవిశ్రాంతంగా కష్టపడాలని యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి రమేష్‌బాబు సూచించారు. యూత్ కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బోయిని కృష్ణబాబు అధ్యక్షతన బుధవారం రేణికుంట గ్రామంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో యూత్ జోడో బూత్ జోడో మానకొండూర్ నియోజకవర్గ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. రమేష్‌బాబు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ యూత్ జోడో బూత్ జోడో ఇన్‌చార్జి తిప్పారపు సంపత్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, పొన్నం ప్రభాకర్, కవ్వంపల్లి సత్యనారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నబోయిన రవి యాదవ్, ఆశిక్ పాషా, అజయ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో చాడ శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.79,050 నగదు, ఆరు ఫోన్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నామని, పేకాటాడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

చొప్పదండి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్‌లకు సహాయ పంచాయతీ కార్యదర్శి హోదా ఇవ్వాలని, ఇతర పంచాయతీ కార్మికుల సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని 27 హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పంచాయతీ కార్మికుల సదస్సు నిర్వహిస్తున్నారు. మండలంలోని జీపీకార్మికులు, కారోబార్‌లు ఎంపీడీవో, ఎంపీవోలకు సదస్సుకు హాజరవుతున్నామని బుధవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రాజనర్సయ్య, వారీశ్, జంగం కొమురయ్య, శ్రీనివాస్, సలీంపాషా, మల్లయ్య, చంద్రయ్య, రాజేశ్, కుమార్ పాల్గొన్నారు.


కొనుగోళ్లు ప్రారంభించాలి

సైదాపూర్: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుందని, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్ బావ్‌సింగ్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలని, నిర్వాహకులు టార్పాలిన్ కవర్లు అందించాలని కోరారు.

చికిత్స కోసం జైలు నుంచి హాస్పిటల్‌కు..

హుజూరాబాద్ రూరల్: మండలంలోని చెల్పూర్ సర్పంచ్ నేరెళ్ల మహేందర్ గౌడ్ 13 రోజుల క్రితం కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్నారు. బుధవారం రాత్రి అతనికి చాతిలో నొప్పి రావడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. నొప్పి తగ్గకపోవడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

పాపాలు పోగొట్టే.. తాపాల గుట్ట



డ్యామ్ లో ఉన్న పురాతన తాపాల గుట్ట ఆలయం



గుట్టపై హనుమాన్ విగ్రహం వద్ద మొక్కలు చెల్లిస్తున్న హనుమాన్ మాలధారులు

- కొండపై కొలువైన తాపాల లక్ష్మీనృసింహస్వామి
- భక్తితో కొలిస్తే కొంగు బంగారం
- గుట్ట పునరుద్ధరణకు కసరత్తు

తిమ్మాపూర్: లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఎక్కడ చూసినా దాదాపు కొండపై ఉంటుంది. యాదాద్రి, సింహాద్రి, నల్లగొండ ఇలా అనేక ఆలయాలు కొండపైనే ఉంటాయి. లక్ష్మీనృసింహుడు కొండపైనే వెలుస్తాడని భక్తుల నమ్మకం. ఎల్‌ఎండీ కాలనీలోని తాపాల గుట్టపైనా లక్ష్మీనృసింహుడు చాలా ఏళ్ల క్రితం స్వయంభూగా వెలిశాడని ప్రతీతి. మానేరు డ్యామ్ నిర్మాణంతో కొండచుట్టూ నీరు ఉంటోంది. డ్యామ్‌లో నీరు తగ్గినప్పుడు గుట్ట కనిపిస్తోంది. అప్పుడు గుట్టపైకి భక్తులు చేరుకొని లక్ష్మీనృసింహుడితోపాటు ఆంజనేయస్వామి పూజిస్తారు.

ఏళ్ల చరిత్ర..

ఎల్‌ఎండీలో ముంపునకు గురైంది తాపాల గుట్ట. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న గుట్ట నీటి మధ్యలో ఉండటంతో ఆదరణకు దూరమైంది. గుట్టపై తాపాల లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి స్వయంభూగా వెలిశారు. ఇక్కడి దేవుళ్లను కొలిస్తే కొంగు బంగారమే అని భక్తుల నమ్మకం. అంతే కాదు కోరిన కోరికలు తీర్చే దేవుళ్లగా ఇప్పటికీ ఏటా కొలుస్తామని, వేసవిలో ఎల్‌ఎండీ జలాశయంలో నీరు తగ్గినప్పుడు గుట్టపైకి వచ్చి మొక్కులు తీర్చుకుంటామని భక్తులు అంటున్నారు. ఎండా, వానకు ఇబ్బందులు పడుతున్నామని, గుట్టపై ఆలయాల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేయాలని భక్తులు, రామకృష్ణకాలనీకి చెందిన పలువురు నిర్ణయించుకున్నారు. గుట్ట వరకు రోడ్డు వేసిన రామకృష్ణకాలనీవారు గుట్టపైకి ఎక్కడానికి గతంలో చిన్నమెట్లను నిర్మించారు. సపోర్ట్‌గా ఇనుపరాడ్లు ఏర్పాటు చేశారు.

సుమారు రూ. పది లక్షలకు పైగాపనులు

ఇటీవల గుట్టపై ఆంజనేయస్వామిని దర్శించుకున్న భక్తులు, పైన ఆలయం నిర్మించాలనే సంకల్పంతో రామకృష్ణకాలనీ చెందిన వ్యాపారి దావు రాజిరెడ్డి మరికొందరు ముందుకు వచ్చి గుట్ట పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. హనుమాన్ విగ్రహానికి స్లాబ్ వేయడంతో పాటు గుట్ట కింద నుంచిపై వరకు సుమారు పది లక్షలకుపైగా పనులు చేపట్టారు. గ్రామస్తులు, ఆంజనేయ స్వామి మాలధారణ భక్తులు గుట్టపైకి ఇటుకలు, ఇసుకను తరలిస్తున్నారు. గుట్టపై పూజలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో భక్తులు సంఖ్య పెరుగుతుందని, అందరి సహకారంతో గుట్టపై ఆలయం నిర్మిస్తామని రాజిరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచ్, జీపీ వార్డు సభ్యులు, గ్రామపెద్దలు చెబుతున్నారు.

మహారాష్ట్ర నుంచి భక్తులు...

కోరిన కోరికలు తీరుస్తాడనే నమ్మకంతో మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి తాపాల లక్ష్మీనర్సింహస్వామికి మొక్కులు చెల్లించుకునేవారు.1989 లోయర్ మానేర్ డ్యాం నీటిమట్టం పెరగడంతో భక్తులు గుట్ట వద్దకు రాలేకపోయేవారు. అదే సంవత్సరంలో రాజీవ్ రహదారి పక్కన ఉన్న గుట్టలో స్వామివారు స్వయంభూగా వెలియడంతో అప్పటి అర్చకుడు తిరునగిరి నారాయణస్వామి ఆయన వంశస్తులు స్వామివారికి నిత్యం పూజలు చేస్తూ భక్తుల సహాయంతో ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి భక్తులు ఇక్కడే పూజలు చేస్తున్నారు.

కోరికలు తీరుతాయని..



తాపాల గుట్ట మీద నరసింహస్వామి, ఆంజనేయ స్వామిని దర్శించుకుంటే కోరికలు తీరుతాయని చిన్నప్పటి నుంచి వింటున్నాను. గ్రామ శివారులోనే గుట్ట ఉన్నా ప్రతి సంవత్సరం ఎల్‌ఎండీ నిండు తుండటంతో గుట్ట వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది అయ్యేది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో గుట్టపైకి ఎక్కి దర్శనం చేసుకున్నా. భక్తుల సౌకర్యార్థం కోసం సుమారు రూ. పది లక్షలుపైగా వెచ్చించి హనుమాన్ విగ్రహానికి సొంత ఖర్చుతో స్లాబ్ వేసి గుట్టకు మెట్లు ఏర్పాటు చేయిస్తున్నాను. అంతేకాకుండా డ్యాంలో నీరు ఉన్నా గుట్ట వద్దకు భక్తులు చేరేలా చర్యలు తీసుకుందామని గ్రామస్తులమంతా నిర్ణయించుకున్నాం.

– దావు రాజిరెడ్డి, రామకృష్ణకాలనీ

గుట్టను అభివృద్ధి చేయాలి



పురాతన తాపాలగుట్ట ఎంతో పవిత్రమైందని ఓ హనుమాన్ మాలదారుడు చెప్పాడు. అందరూ స్వామిని దర్శించుకుంటున్నారని చెప్పడంతో నాతో పాటు చాలామంది హనుమాన్ స్వాములు గుట్టపై ఆలయ అభివృద్ధి కోసం సిమెంట్ ఇటుకలు పైకి తీసుకెళ్తున్నాం. గుట్టపై దేవుళ్లను దర్శించుకుంటే సంతోషంగా అనిపించింది. మండల ప్రజాప్రతినిధులు, భక్తులు ఆలయ నిర్మాణానికి సహకరించి తాపాలగుట్టను అభివృద్ధి చేస్తే మండలంలోని హనుమాన్ స్వాములు, భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.

– ఎల్లాల రమణారెడ్డి, హనుమాన్ మాలధారుడు, పోరండ్ల

తెలంగాణపై కేంద్రం వివక్ష

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



చొప్పదండి: వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చొప్పదండి: బీజేపీ పాలిత ప్రాంతాల్లో విపత్తులకు కేంద్ర ప్రభుత్వం తక్షణం సాయం మంజూరు చేస్తోందని, తెలంగాణపై వివక్ష చూపుతూ సాయం అందించడం లేదని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బుధవారం వెదురుగట్ట, భూపాలపట్నం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. గతంలో జరిగిన నష్టానికి కేంద్రం స్పందించ లేదని, ఎంపీ బండి సంజయ్ రైతులను పరామర్శించడంలేదని విమర్శించారు. గతనెల జిల్లాలో నష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం రూ. 8.16 కోట్ల పరిహారం త్వరలో రైతుల ఖాతాలో జమచేయనుందని, చొప్పదండి నియోజకవర్గంలో సుమారు 4 వేల మంది రైతులకు రూ. 3.50 కోట్ల పరిహారం మంజూరు అయిందని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ నష్టాన్ని అంచనా వేస్తున్నారని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్రం నుంచి ఎకరానికి రూ. 20 వేల నష్ట పరిహారం తీసుకురావాలని సవాల్ విసిరారు. వెంట ఏవో వంశీక్రిష్ణ, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్క రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, మాచర్ల వినయ్‌కుమార్, గుడిపాటి వెంటకరమణారెడ్డి, ఏలేటి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: నష్టపోయిన పంటలపై వ్యవసాయాధికారులు పూర్తి స్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలను అందించాలని ఎమ్మెల్యే రవిశంకర్ అధికారులకు సూచించారు. మండలంలోని పందికుంటపల్లి గ్రామ పరిధి కుర్మపల్లిలో ఇటీవల రేకుల షెడ్డు కూలి గొర్రెలు మృతి చెందగా గొర్రెలకాపరులతో మాట్లాడి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, మండల ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, తహసీల్దార్ రాజుకుమార్, మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డి, మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి,కోడిమ్యాల రాజేశం పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



రామడుగు: మాట్లాడుతున్న సీడీపీవో కస్తూరి

రామడుగు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కస్తూరి కోరారు. మండలంలోని గుండి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రీస్కూల్ మేళాలోమాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ విద్య అందించడం, పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండి మానస, మెడికల్ ఆఫీసర్ గ్రీష్మ, సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీబాయి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

చొప్పదండి: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని రాగంపేటలో బుధవారం ప్రీస్కూల్ మేళా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలకు పోషకాహారం అందించే ఏకైక పాఠశాల అంగన్‌వాడీ కేంద్ర మని, అసెస్‌మెంట్ కార్డ్స్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎల్లమ్మ, శశిరేఖ, ఆయాలు పాల్గొన్నారు.



చొప్పదండి: రాగంపేటలో..

రైతులు అధైర్యపడొద్దు



వీణవంక: పంటను పరిశీలిస్తున్న కౌశిక్‌రెడ్డి



చిగురుమామిడి: చిన్నముల్కనూర్‌లో..

వీణవంక: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోర్కల్ గ్రామంలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. అనంతరం చల్లూరు, కోర్కల్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉందని, కేంద్ర ప్రభుత్వం రైతులపై వివక్ష చూపుతున్నప్పటికీ సీఎం కేసీఆర్ రైతులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మాడ సాదవరెడ్డి, ముసిపట్ల తిరుపతిరెడ్డి, జక్కు నారాయణ, బొంగోని రాజయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, సంగ సమ్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, చెక్కబండి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హుజూరాబాద్‌రూరల్: రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతిరెడ్డి పేట, వెంకట్రావుపల్లి, సిర్సపల్లి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.పదివేల నష్టపరిహారం అందించేందుకు సీఎం కేసీఆర్ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో అనూష, సర్పంచులు తాటికొండ పుల్లాచారి, కన్నెబోయిన తిరుమల తిరుపతి,ఎడ్ల సువర్ణల సునీయం,ఎంపీటీసీలు శ్రీనివాస్ గద్దల జయరాజ్, ఎడ్ల రాధమ్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నెబోయిన శ్రీనివాస్ యాదవ్, నాయకులున్నారు.

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో నేల కొరిగిన వరిపంటలను బుధవారం ఏవో శ్రీనివాస్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి రైతులను ఓదార్చారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు శైలజ, సునంద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, రైతు సమన్వయసమితి కోఆర్డినేటర్ రవి, రైతులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ వరి, మొక్కజొన్న, మామిడి తోటలను బుధవారం ట్రైనీ కలెక్టర్ నికోలస్ పరిశీలించారు. దెబ్బతిన్న పంటలపై సత్వరమే సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వెంట చిగురుమామిడి తహసీల్దార్ ముబీన్‌అహ్మద్, ఏఓ రంజిత్‌కుమార్, ఆర్ఐ రాజు, ఏఈఓ సౌజన్య, సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ నరేశ్, తో పాటు పలువురు రైతులు గ్రామస్తులు ఉన్నారు.



హుజూరాబాద్‌రూరల్: పోతిరెడ్డిపేటలో...



శంకరపట్నంలో...

అ'పూర్వ' సమ్మేళనం



రామడుగు: మండలంలోని గుండి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల 1989-90 పదోతరగతి విద్యార్థులు ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో మంజుల, జ్యోతి, శోభ, అనసూర్య, మధుకర్ రెడ్డి, రాజేశం, కళాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మేడిపల్లి సత్యం

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలపై సర్వే చేసి ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నెల రోజుల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ మండలంలో పర్యటించి నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ. పదివేలు ఇస్తామని ప్రకటించినా నేటికీ పరిహారం అందించలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మరవేని తిరుపతి, కోల రమేశ్, జివ్వాజీ హరీశ్, పులి అంజనేయులుగౌడ్, పంజాల శ్రీనివాస్, సహృదయ్, రవీందర్, విక్రమ్‌రెడ్డి, మాధవరెడ్డి పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రామడుగు: వెదిరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజశేఖర్‌గౌడ్

రామడుగు: మండలంలోని వెదిరలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వీడీసీ చైర్మన్ నాగుల రాజశేఖర్‌గౌడ్ ప్రారంభించారు. ఐకేపీ అధికారి కరుణాకర్, రైతుబంధు కమిటీ అధ్యక్షుడు దొడ్డ లచ్చిరెడ్డి, ఉపసర్పంచ్ ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య రైతులు పాల్గొన్నారు.

శంకరపట్నం మండలంలో..

శంకరపట్నం: మండలంలోని కరీంపేట, చింతగుట్ట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను తాడికల్ విండో చైర్మన్ మధుకర్‌రెడ్డి జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మొలంగూర్‌లో మెట్‌పల్లి విండో చైర్మన్ సంజీవరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్‌లు రజిత, మల్లయ్య, ఎంపీటీసీ తిరుపతయ్య,సీఈవోలు సదయ్య, వేణుమాధవ్, డైరెక్టర్లు ఉన్నారు.

కొనుగోళ్ల పరిశీలన

జమ్మికుంట: జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోళ్లను తహసీల్దార్ రాజేశ్వరి పరిశీలించారు. తడిసిన ధాన్యం ఆరబోస్తున్న రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లు వేగవంతంగా సాగుతున్నాయని, ఎలాంటి సమస్యలున్నా ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిష్కరిస్తామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వీణవంక: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మడుగూరి సమ్మిరెడ్డి, గూటం సమ్మిరెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలనుప్రారంభించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అన్నిఏర్పాట్లు చేశామని, రైతులు మద్దతు ధరపొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు చెక్కబండి శ్రీనివాస్‌రెడ్డి, రాములు, కామిడి కావ్యశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పంజాల సతీశ్‌గౌడ్ పలువురు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



హన్‌మాన్ భక్తులకు అన్నదానం

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని శ్రీ పాంబండ పంచముఖాంజనేయస్వామి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి షష్టి తిథి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆంజనేయస్వామి భక్తులు, ఇతరులు పంచామృత, అభిషేక పూజలు, శ్రీపూజ్య గురు హుమేశ్ స్వామీజీ వైభవంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. హన్‌మాన్ భక్తులకు ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి దంపతులు, సంజనరెడ్డి, దామోదర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొలుగూరి మోహన్‌రెడ్డి, తేరాల సత్యనారాయణ, చిటుమల్ల విశ్వనాథం, అమర్, శివ, స్వామి, గణేశ్, వేణు పలువురు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో పోచమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళం అందిస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం పర్లపల్లి సమ్మయ్య రూ.10,016 అందజేశారు. దాతలు ముందుకు వచ్చి విరాళం అందజేసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కమిటీ సభ్యులు రమేష్, నాగరాజు, రాజమల్లు, అశోక్, కుమారస్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న భక్తుడు

ఆర్థికసాయం అందజేత



మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో ఇటీవల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సుంకు రాజారాం అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం సుడా చైర్మన్ జీవీఆర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.20వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారునంది కిషన్, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.